ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (భుజభలపట్నంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 28-10-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మరణించిన తరువాత జీవుడు ఇతరలోకాలకు ప్రయాణంచేస్తాడు అని చెపుతున్నారు ఆలోకాలు నిజమేనా అని అడుగుతున్నారు. జీవుడు ఎంతనిజమో ఆలోకాలుకూడా అంతేనిజం. ఒకలోకానికి వెళితే అంతకంటే పైలోకానికి వెళ్ళాలని అనిపిస్తుంది. అది యదార్ధమైన స్థితికాదు అవి అన్ని మన మనస్సుయొక్క కల్పితమే. అజ్ఞాని ఎల్లప్పుడు మనస్సునుచూస్తూ ఉంటాడు జ్ఞానిఎప్పుడూ చైతన్యాన్నిచూస్తాడు. మనస్సు బాహ్యాముఖానికి వెళితేదానికి ముగింపు ఉండదు. మనస్సు బాహ్యాముఖానికి వెళితే అజ్ఞానం నశించదు. మనస్సు అంతర్ముఖమయితే వాడికి శాంతికలుగుతుంది, జ్ఞానంకలుగుతుంది, హృదయంలో ఉన్నవస్తువును తెలుసుకుంటాడు. తనహృదయంలో ఉన్న వస్తువును తెలుసుకున్నాక ఈ లోకానికి, ఇతరలోకాలకు కూడా తన హృదయంలో ఉన్న వస్తువే ఆధారంగా ఉంది అన్నసంగతి వాడికి తెలుస్తుంది.

తలంపులు లేకుండా ఉండగలమా అని అడుగుతున్నారు. నీహృదయంలో ఒకవస్తువు ఉంది. అది సముద్రం అంత విశాలమైనది, గంభీరమైనది, లోతైనది. ఆవస్తువుకు తలంపులు లేవు, ఊహలులేవు. ఆవస్తువు యొక్క స్వరూపము నీఊహకు అందదు. తలంపులు లేని, ఊహలు లేని నీహృదయంలో ఉన్న ఆవస్తువును తెలుసుకుంటే నీవు తలంపులు లేకుండా, ఊహలు లేకుండా ఉండగలవు. నేనుచనిపోతున్నాను అనేది కూడా ఒకతలంపే. తలంపులలోనుండి విడుదల పొందినప్పడు నీవు చావునుకూడా జయించి చావునుండి విడుదల పొందుతావు, అమృతస్థితిని పొందుతావు. అహంకారము తలంపులు లేకుండా, సంకల్పాలు లేకుండాఉండలేదు. అందువలన తలంపులు లేకుండా, సంకల్పాలు లేకుండా ఉన్నవస్తువు మనకు తెలియటంలేదు. మీ హృదయంలోఉన్న తలంపులు లేని వస్తువు మీకు తెలియాలంటే ఒకమహాగురువు యొక్క, ఒక జ్ఞానియొక్క శక్తి తరంగాలు, శాంతి తరంగాలు వచ్చి మీహృదయాన్ని తాకాలి. గురువు యొక్క అనుగ్రహం నీహృదయాన్ని తాకినప్పడు దానికి సంబందించిన అనుభవం నీకు వస్తుంది. అనుభవం తాత్కాలికంగా ఉంటుంది అది స్థిరమవ్వాలంటే నీవు కష్టపడి సాధనచేసి వాసనాక్షయం చేసుకోవలసిందే.

భౌతికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని మనం అభివృద్ధిని సాధించాలంటే ఏకాగ్రత, చిత్తశుద్ది అవసరము. ఇవి రెండూఉన్నవాడు ప్రతీపని సాధించగలడు. వాడు సాధించలేని పని అంటూ ఏమి ఈ సృష్టిలో ఉండదు. చిత్తశుద్ధి ఉన్నవాడికి దేవుని అనుగ్రహం వస్తుంది. వాడు చేసేపని సఫలం అవుతుంది. మనస్సు బాహ్యా ముఖానికి వెలుతూ ఉంటే ఆలోకంకాదని ఈ లోకం, ఈలోకం కాదని ఆలోకం అలా గంతులు వేస్తూనేఉంటుంది. అసలు వస్తువును తెలుసుకోకుండా అదికాదని ఇది, ఇదికాదని అది అనుకుంటూ తిరుగుతున్నంత కాలము నీకు శాంతి దొరకదు. ఎందుచేతనంటే శాంతి అనేది బాహ్యంగా లేదు, నీ స్వరూపంలోనే ఉంది. నీమనస్సుకు అంతర్‌దృష్టి కలిగితే గాని,

గురువు అనుగ్రహం ఉంటేగాని నీస్వరూపం నీకుఅందదు. నీకు శాంతి ఎంతవరకుదొరికింది అది చూసుకోగాని చనిపోయిన తరువాత ఏ లోకాలకు వెళతాము, ఆలోకాలు వున్నాయా అనే గొడవ వద్దు. అక్కడకు వెళ్లినా ఆలోకంలో ఎంతకాలం ఉంటావు. ఈ లోకం ఎంతనిజమో ఆలోకాలు కూడా అంతే నిజం. ఈలోకాలదృష్టిలోనికి వెళ్లకు. వస్తువు నీహృదయంలోనే ఉంది. నీమనస్సును నిర్మలం చేసుకొని, మనస్సును ఉపసంహరించి, మనో మూలంలో ఉన్న వస్తువును తెలుసుకొంటే నీకు శాంతి కలుగుతుంది. అంతవరకు నీకు శాంతిలేదు.

మనస్సు బాహ్యముఖానికి వెళితే అది బాడి చేసుకొంటుంది. మనస్సు అంతర్ముఖమయితే ఉన్నబాడిని వదిలించుకొని స్వచ్ఛమై తనమూలంలోనికిఉపసంహరింపబడుతుంది .మనస్సు అంతర్ముఖమయితే నిర్మలమైనవస్తువును పొందుతుంది. మనస్సును ఉపసంహరించటం ముఖ్యం. నీహృదయంలో ఉన్న శాంతి నీకు అందినపుడు దానికి భిన్నంగా ఏదీకనిపించదు. ఈప్రశ్నలు ఏమీ ఉదయించవు. ఇతరలోకాలు ఉన్నాఒక్కటే, లేక పోయినా ఒక్కటే. నిజంగా వైకుంఠము ఉన్నా అక్కడికి వెళ్లాలని అనిపించదు. అట్టిది నీహృదయంలో ఉన్న చైతన్యం, శాంతి. జ్ఞానికి చూడటానికి అంటూ ఏమీలేదు. ఎక్కడికి వెళ్లినా తననుతానే చూసుకుంటాడు. తనకు భిన్నంగా ఏమి కనిపించదు. మనకుభిన్నదృష్టి ఉంటుంది కాబట్టి ఏదోచూడాలని ఉంటుంది. నీకు సద్బుద్ధి కలగటానికి మహాత్ములతోను, సత్పురుషులతోను, జ్ఞానులతోను సహవాసంచెయ్యి. అప్పడు ఇతరమైన సాధనలు లేకుండా, కష్టాలు లేకుండా వస్తువు తానుగా నీకు వ్యక్తమవుతుంది.

ఎవరి అనుగ్రహం వలన మీకు జ్ఞానం సంపాదించాలి అనేబుద్ధి కలుగుతోందో వారి అనుగ్రహం వలననే మీకు జ్ఞానం కలుగుతుంది. సంశయించవద్దు, సంశయం పెట్టుకుంటే నశిస్తారు. ఎవరిశక్తివలన మీకు జ్ఞానం సంపాదించాలనే కాంక్షకలుగుతోందో వారిశక్తివలననే మీకు జ్ఞానం కలుగుతుంది ఆశక్తి మిమ్మల్ని వెంటాడుతుంది. మీకుజ్ఞానం కలిగేవరకు ఆశక్తి మిమ్మల్ని విడిచిపెట్టదు. మీరు అనుమానించవలసిన పనిలేదు. నీవు ఎవడో నీకు తెలియదు. నిన్ను నీవు తెలుసుకున్నాక కూడా ఇతరలోకాలు నీకుకన్పిస్తే వాటిగురించి ఆలోచించవచ్చు. ఇప్పడు వాటిగొడవ వద్దు. ఈ ప్రపంచం గురించి కూడా ఆలోచించవద్దు. నువ్వు ఎవడో నీవు తెలుసుకో. నువ్వు ఎవడో నీవు తెలుసుకున్నాక ఈ ప్రపంచాన్ని చూడు. అప్పడు ప్రపంచం నీకు భిన్నంగా కన్పిస్తే ప్రపంచం గురించి నీవు ఆలోచించవచ్చు. అద్వైతస్థితిలో నేను, ప్రపంచము, దేవుడు ఒకటిగానే ఉంటాయి. అది పరమస్థితి, అది చివరిస్థితి.

ఉన్నది ఒక్కటేవస్తువు అంటున్నారు. ఈలోకం అంతా అనేకంగా కనిపిస్తోందికదా. ఏదినిజం అని ఒక పండితుడిని అడిగారు. అదీ దేవుడే, ఇదీ దేవుడే అనుకొంటే మనకు తంటా ఉండదు అని ఆయన చెప్పారు. ఒకటి దేవుడు, రెండు దేవుడు, మూడు దేవుడు అలామనకు కనిపించేది అంతా దేవుడే అని అనుకొంటే తంటాలేదు. మన మనస్సు ఎక్కడ వాలుతూఉంటే అక్కడ దేవుడిని చూస్తూ ఉంటే మనకు తంటాఏమి ఉండదు, మోహం కలుగదు. మీరు జపం చేసేటప్పడు, ధ్యానం చేసేటప్పడు, మీమనస్సుకు అంతర్దృష్టి కలిగినపుడు, మీరుపవిత్రులు అయినపుడు మీకు కొన్నిమహిమలు చేసేశక్తి రావచ్చును. అదికూడా నిజంకాదు. మహిమలు ప్రదర్శించేవాడికి కూడా ఒక నేను ఉంటుంది. వాడుకూడా ఆనేను ఎవడో తెలుసుకోవాలి గాని మహిమలతో ఆగిపోకూడదు. మహిమలు దగ్గర

ఆగిపోతేమీరు గమ్యంచేరలేరు. మహిమలు ప్రదర్శించే నేనును తెలుసుకుంటేగాని మీరు పరమస్థితిని పొందలేరు. స్వప్నంలో కనిపించే దృశ్యాలు ఎంత నిజమో ఈ మహిమలు కూడా అంతే నిజం. జ్ఞానం కలిగిన తరువాత కూడా కొంతమంది ద్వారా మహిమలు జరుగవచ్చు. సిద్ధులు కొంతమందికి సహజంగావస్తాయి. కొంతమందికి సిద్ధులు రాకపోవచ్చును. అది దేహప్రారబ్ధమును బట్టి ఉంటుంది. సిద్ధులున్నాయా లేవా అన్నదిముఖ్యంకాదు. జ్ఞానం కలిగిందా లేదా అన్నది ముఖ్యం. సిద్ధులు అప్రధానమైన విషయములు. జ్ఞానికి సిద్ధులు వచ్చినా రాకపోయినా ఒక్కటే. ఉన్నది పోదు, లేనిది ఉండదు అని జ్ఞానికి తెలుసు. అందుచేత నిశ్చలంగా నిర్మలంగా ఉంటాడు ఆయన ఏకాగ్రతకు భంగంలేదు. నీకు ఎన్నిరకాల సిద్ధులు ఉన్నా అవిఅన్నీ అప్రధానం. అన్నిటికంటే ఉదాత్తమైనది జ్ఞానమే. నేను అనే బుద్ధిఉండి మహిమలు చేసేవాడు నేను మహిమలు చేస్తున్నాను, నేనువారికి ఉపకారము చేస్తున్నాను అనుకుంటాడు. జ్ఞాని మహిమలు చేయడు, జ్ఞాని ద్వారా మహిమలు జరుగ వచ్చు. మహిమలు జరిగినా జరుగుతున్నట్లు అయనకు తెలియదు ఎందుచేతనంటే అక్కడ నేను లేదు.

దేవుడులేడు అని ఎవరైనా చెప్పినా మీరు నమ్మకండి. మీరూపాలు కంటితో చూస్తున్నాము. మీలో మంచితనము ఉంటే కంటితో చూడలేము. మనస్సుతో చూడగలం దేవుడు మాట అటువుంచండి నీలో ఉన్నమంచితనమే కంటికి కనబడటంలేదు ఇంకదేవుడు ఏమి కనిపిస్తాడు అన్నాడు షేక్ష్పియర్. మీరూపం నాకుకనబడుతుంది నాలో గ్రహించే శక్తి లేనప్పుడు మీలో ఉన్నమంచితనం తెలివి నాకు కనబడవు. ఇంద్రియాలకు కనబడని విషయాలు మనస్సుకు కనబడతాయి. మనస్సుకు కనబడని విషయాలు బుద్ధికి కనబడతాయి. బుద్ధికి అందని విషయాలు చైతన్యానికి అందుతాయి. హృదయంలో ఉన్నవస్తువు తెలియాలంటే నీమనస్సు లయం అవ్వాలి. ఇది తర్కాలతోటి వచ్చేది కాదు కేవలం తెలివివలన వచ్చేదికాదు కుయుక్తులవలన, కుతంత్రాలవలన వచ్చేదికాదు. తెలివి మంచిదే. వివేకం మంచిదే. ఏది నిజంకాదో అందులోనుండి మనం వేరుపడటానికి వివేకము అవసరం. అయితే ఆతెలివి నీ హృదయంలో ఉన్నవస్తువును తెలుసుకోవటానికి సహకరించాలి.

అక్కడ పసుపు రాలుతోంది, ఇక్కడ కుంకుమ రాలుతోంది అంటే అది జ్ఞానమా ? వాడుచనిపోతూ ఉంటే ఆయనవచ్చి బ్రతికించాడు అంటే అది జ్ఞానమా? కాదు. ఇప్పడు నీమనస్సు నీకునేనుగా ఎలావ్యక్తమవుతోందో అలాగ నీహృదయంలో ఉన్న చావులేని వస్తువు నీకునేనుగా వ్యక్తమయితే అది జ్ఞానం. అది తప్పించి మిగిలినవి అన్నీ జ్ఞానంకాదు. ఉన్నది ఒక్కటే,. ఆవస్తువు నీకు అనుభవంలోనికి వస్తే అది జ్ఞానం.అది మనస్సుతో గ్రహించేది కాదు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. మహిమలు చేసేవారికి వారిలో ఉన్న వెలితి వారికి తెలుస్తూ ఉంటుంది. ఎందుచేతనంటే వారువున్నస్థితి నిజం కాదు. నిజస్థితిలోనికి వెళ్ళాలి అనే కోరిక వారికి కలుగుతూ ఉంటుంది. మహిమలు ఉన్నవాడు జ్ఞానం కావాలి అని కోరుకుంటాడు. కాని జ్ఞానంకలిగినతరువాత మహిమలు కావాలి అని కోరుకోడు. ఇటువంటి గొడవలు ఏమి ఉండవు. అందుచేత నీవు జ్ఞానాన్నికోరుకో. భగవంతుడినే కోరుకో. అంతేగాని సిద్ధులుకోరుకోవలసిన పనినీకులేదు భగవంతుడిదగ్గరకు వెళ్ళినీవే నాకుకావాలి అని అడగకుండా మహిమలు అడగటం ఎలా వుంటుంది అంటే ఒక మహాధనవంతుడి దగ్గరకువెళ్ళి పాచిపోయిన గెంజికోసం అడిగినట్లుగా ఉంటుంది. మోక్షమును పొందాలి అనే విషయమును మర్చిపోయి కేవలము బాహ్య విషయములమీద,

సిద్దులమీద మనస్సును పెట్టుకొంటే మీకు బంధం ఏర్పడుతుంది, శాంతి కలుగదు. మీరు సిద్దులు బాగా ప్రదర్శిస్తూ ఉంటే చూసేజనం బాగా సిద్దులు ప్రదర్శిస్తున్నారు అని అంటూ ఉంటే మీకు అజ్ఞానం పెరుగుతుంది. శాంతి సున్నా, జ్ఞానం సున్నా.

ఇతరులు పొగిడితే మనం సంతోషిస్తాము, విమర్శిస్తే కృంగిపోతాము. ఆగుణం ఎక్కువగా ఉంటే సత్పురుషులతో సహవాసం వలన ఆగుణం నశిస్తుంది. కొంతమంది ప్రతీమాట లౌక్యంగా మాట్లాడతారు. మేముతెలివైన వారము అనుకొంటారు. ఆమాటలే నేర్చుకొని ఇతరులు కూడా లౌక్యంగా మాట్లాడితే వారు లౌక్యంగా మాట్లాడుతున్నారు అని అనరు వారు మోసగాళ్ళు అంటారు. వారుమాట్లాడితే లౌక్యం అదేమాట ఇతరులు మాట్లాడితే మోసం అంటారు. మానవస్వభావం ఇలా ఉంటుంది అన్నాడు షేక్సిఫియర్.

చాలామంది ఏమనుకొంటున్నారు అంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటం అంటే ఏదో శక్తులను సంపాదించటం అనుకొంటున్నారు. శక్తులనుసంపాదించటంకాదు. జ్ఞానం సంపాదించటమే. శక్తులు వాటిఅంతట అవే వస్తే నీకు వాటివలన ఇబ్బంది లేదు, కోరితెచ్చుకొంటే అవి నిన్ను బంధిస్తాయి. వస్తువు ఏదైనా దానంతట అదే మన చేతికి వస్తే బంధించదు. కోరి తెచ్చుకొన్నది బంధిస్తుంది. ఈ దేహము నాకు తెలుస్తోంది. కాని హృదయంలో ఉన్న ఆత్మకు సంబందించిన అనుభవం నాకు లేదు అంటున్నారు. దానికి సంబందించిన అనుభవం నీకు లేకపోయినా అదే నువ్వుఅంటున్నారు భగవాన్. అదిఎందుకు తెలుసుకోవాలంటే దానిని తెలుసుకుంటే ఈ ప్రకృతిగుణాల నుండి, జననమరణ ప్రవాహామునుండి బయటకువస్తావు. నీవు ఏదైనా వింటున్నావంటే, చూస్తున్నావంటే నీలోపల చైతన్యము ఉంది కాబట్టే వింటున్నావు, చూస్తున్నావు. ఏదైతే లేదు,లేదు అని నీవు అనుకుంటున్నావో అది ఉందికాబట్టే ఇవి అన్నీ చేయగలుగుతున్నావు. బాహ్యవిషయాలనుచూసి మోహపడవద్దు, వాటి ఆకర్షణలో పడకు. వాటి ఆకర్షణలో పడితే ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతావు. ఉన్నదేదో ఉంటుంది. నీమనస్సుతో సంపాదించేది అంతా కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. నీకు తెలివి ఉండవచ్చు సంపద ఉండవచ్చు మంచిదే. వాటిని సద్వినియోగ పరచుకుంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. నీవు పవిత్రుడవు అవుతావు, నీవు పవిత్రుడవు అయితే ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలనే కాంక్ష కలుగుతుంది.

నీకు మంచం , మంచంమీద పరుపు, తలక్రింద దిండు, పైనసీలింగ్ ఫ్యాను ఉన్నాయనుకో, ఇవి అన్ని ఎందుకు సుఖంగా నిద్రపట్టటానికి. ఇవిఅన్నీ వున్నాయినాకు నిద్రపట్టకపోయినా ఫరవాలేదు అని ఎవడైనా అనుకుంటాడా ? అనుకోడు. ఇన్నిసదుపాయములు ఉన్నా నిద్రపట్టకపోతే వాడిగతి ఎలాఉంటుందో అలాగే భగవంతుడు అనేకఅవకాశములు ఇచ్చినా వాటిని ఉపయోగించుకొని జ్ఞానమును పొందక పోతే నీగతి కూడా అలాగే ఉంటుంది. భగవంతుడు ఇచ్చిన అవకాశములు ఉపయోగించుకుని మీరు జ్ఞానమును పొందాలి. నీకు అన్నీ ఉన్నాయి అనుకో, శాంతి లేదు అనుకో ఒకటిలేని సున్నలతో సమానము. మీకు ఎన్నోసిద్దులు ఉన్నాయి అనుకోండి, జ్ఞానంలేదు అనుకోండి ఆసిద్దులు అన్ని సున్నాలతో సమానము. భోగదృష్టిని తగ్గించుకొని యోగదృష్టిని పెంచుకోవటం తపస్సు. భగవదనుభవం పొందటానికి ఏగుణాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని ఎండబెట్టటం తపస్సు.